'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

గుంతకల్లుటౌన్: అర్హత ఉన్నా వివిధ కారణాల చేత సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి కూడా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ తెలిపారు. గురువారం పట్టణంలోని 28వ వార్డు సచివాలయంలో ఆమె సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఇంకా ఎవరైనా అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారేమో పరిశీలించి వారికి కూడా లబ్ధి చేకూర్చేలన్నదే కార్యక్రమం ముఖ్య లక్ష్యమని చెప్పారు. వార్డుల్లో ఏవైనా చిన్న చిన్న సమస్యలున్నా వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అంతేకాకుండా రేషన్‌కార్డులు, కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ, మ్యుటేషన్, ఆధార్‌కార్డుకు మొబైల్ నంబర్ లింకేజీ తదితర సంక్షేమ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లను కూడా వీలైనంత త్వరలోనే ఆయా కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నట్లు ఆమె వెల్లడించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎండీ.ఖలీల్, ఎంఎల్‌ఓ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష' ప్రత్యక్ష ప్రసారం

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం మున్సిపాల్ హాల్లో ఉంటుందని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేయాలి

పామిడి: ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు, అనధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ గురువారం తెలిపారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.

నార్పల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అక్కడికక్కడే అందజేయడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమం జూలై 1 నుంచి ప్రతి సచివాలయంలోనూ నెల రోజుల పాటు జరగతుందన్నారు. సచివాలయాల మండల కన్వీనర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గన్నేవారిపల్లిలో 'వైఎస్సార్ కంటి వెలుగు'



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మధుసూదనరాజు

తాడిపత్రి టౌన్: గన్నేవారిపల్లి- 3వ సచివాలయంలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి 11 మందిని కంటి ఆపరేషన్లను ఎంపిక చేసినట్లు కంటి వైద్యాధికారి మధుసూదనరాజు తెలిపారు. జూలైలో శస్త్ర చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. చుక్కలూరు వైద్యాధికారి లావణ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనుల పరిశీలన

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని ఎస్‌టీపీ-2కు సంబంధించి అండర్ డ్రైనేజీ (యుజీడీ) పైప్ మరమ్మతు పనులను గురువారం ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వతరగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలో ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 33వ వార్డులో పారిశుధ్య పనులు, ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాల్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. గురువారం ఉదయం శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటించిన కమిషనర్ కాలనీలో జరుగుతున్న శానిటేషన్ పనులపై ఆరా తీశారు. ఫిల్టర్ మీడియా మార్పు పనులు జరుగుతున్నందున నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వారం రోజుల్లో సమస్యను పరిష్కరించి యథావిధిగా నీటి సరఫరా చేస్తామన్నారు. అంతకుముందు ఆయన సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

బుక్కరాయసముద్రం: బీఎల్‌ఓలు ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాల తయారీపై బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు నమోదు, ఓటరు తొలగింపుపై జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రజల్లో ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఓటరు కార్డు ఆధార్ కార్డును అనుసంధానం చేయాలన్నారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐ సంధ్య,బీఎల్‌ఓలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ రోగులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీరోడ్డులోని అబ్దుల్ కలాం ఆజాద్ మున్సిపల్ ఫంక్షన్ హాలులో గురువారం ఫయాజ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది టీబీ రోగులకు ఫయాజ్ సేవా ట్రస్టు చైర్మన్ పయాజ్‌బాషా నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ రోగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ట్రస్టు ద్వారా ఉచిత రక్త పరీక్షలు, వడ్డీలేని రుణాల పంపిణీ, త్వరలోనే ఉచితంగా ఇళ్ల స్థలాల పంపిణీ చేపట్టనున్నట్లు ప్రకటించారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబాషా, మాజీ కౌన్సిలర్లు వరదలయ్య, డీవీ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, రియాజ్, అస్లాం, టీబీ క్లస్టర్ సుపర్‌వైజర్ సునిల్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు శాశ్వత భూ హక్కు



ఇల్లూరులో భూ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: రీ సర్వేతో రైతులకు శాశ్వత భూహక్కు లభిస్తుందని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. గురువారం ఇల్లూరులో రెవెన్యూ అధికారులు భూ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి గ్రామంలో భూ సర్వే చేస్తామని, ఇందుకు రైతులు సహకరించాలన్నారు. భూ సర్వేకు ముందు సంబంధిత రైతులకు నోటీసులు అందజేస్తామని, రైతులు భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు సిబ్బందికి అందజే యాలన్నారు. ప్రతి రైతుకు ఎల్‌పీఎం ఆధారిత మ్యాప్ చేసి పట్టాదారు పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. సర్వే జరిగే సమయంలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. సర్పంచు జయరాముడు,శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ శంకర, మండల సర్వేయర్ శ్యామల, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కాజ్‌వేకు మోక్షం

పెద్దపప్పూరు: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో కాజ్ వే సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వివరాలు... మండలంలోని జూటూరు జోడిధర్మాపురం సరిహద్దులో పెన్నా నదిపై ఉన్న కాజ్ వే కొన్ని నెలల క్రితం పూర్తిగా దెబ్బతింది. ఈనేపథ్యంలో ప్రజాసంక్షేమ పాదయాత్రలో భాగంగా కాజ్ వే పరిస్థితిని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే కాజ్ వే నిర్మాణానికి రూ.1.40 కోట్లను మంజూరు చేయించారు. గురువారం ఆర్‌అండ్‌బీ డీఈ సురేష్ నాయక్, జేఈలు మూర్తి, రామేశ్వర్ రెడ్డి, శ్రీదేవి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డిలు కాజ్ వే నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాజ్ వే నిర్మాణం పూర్తయితే దాదాపు 10 గ్రామాలకు రాకపోకలకు దూరం తగ్గనుంది. అశ్వత్థం వద్దనున్న కాజ్ వేను అదేరీతిలో నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కాజ్ వే పనులను ప్రారంభిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ సురేష్‌నాయక్

ఈ-కేవైసీ తప్పనిసరి

పెద్దవడుగూరు : మండలంలోని రైతులు తప్పకుండా ఆర్బీకేల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ మల్లీశ్వరి తెలిపారు. పీఎం కిసాన్ డబ్బు జమ కావాలంటే ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే రైతులు పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

ఆర్థోపెడిక్ డాక్టర్‌గా వెంకటరమణ



గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి లో ఆర్థోపెడిక్(ఎముకల) డాక్టర్‌గా వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రి నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ కంఠం కబ్జాపై ఫిర్యాదు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లిలో చంద్ర అనే వ్యక్తి గ్రామ కంఠం స్థలాన్ని కబ్జా చేశాడని గ్రామస్తులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామంలోని సర్వే నంబర్ 318లో ఉన్న మూడు సెంట్ల గ్రామ కంఠం స్థలాన్ని గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా రికార్డులు పరిశీలించి గ్రామ కంఠం భూమి అని రెవెన్యూ అధికారులు నిర్ధారించి స్థలం ఖాళీ చేయాలని స్థలం ఆక్రమించుకున్న వ్యక్తికి తెలిపినా అతడు పట్టించుకోలేదు. పోలీసులు బందోబస్తు ద్వారా స్థలాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించాలని గ్రామస్తులు సీఐ వెంకటరామిరెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ పశుబీమాతో రైతులకు మేలు

గుత్తి రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకంతో రైతులకు మేలు చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్.వై.రమేష్‌రెడ్డి సూచించారు. గురువారం అనగానదొడ్డి గ్రామంలో వైఎస్సార్ పశు బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ వ్యాధులు లేదా ప్రమాదవశాత్తు పశువులు, జీవాలు, మరణిస్తే రైతులకు పరిహారం అందేలా ప్రభుత్వం బీమా పథకాన్ని రూపొందించిందన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు లబ్ధిదారుల వాటా కింద 20 శాతం, లేని వారు 50 శాతం ప్రీమియం చెల్లించి పథకంలో చేరొచ్చన్నారు. పశువులకు మాడేళ్లు, జీవాలు, పందులకు రెండేళ్ల వరకూ పథకం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన బీమా కన్నా ఎక్కువ మొత్తానికి కూడా రైతులు బీమా చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు భారతి, ప్రదీప్‌కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీ రమేష్‌రెడ్డి

నేడు పశుబీమాపై అవగాహన

బుక్కరాయసముద్రం: ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ పశుబీమాపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సదస్సులో రైతులకు వైఎస్సార్ పశుబీమా, సబ్సిడీ దాణా పంపిణీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సదస్సుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ ఏర్పాటు

గుంతకల్లుటౌన్: పట్టణంలో వీధి వ్యాపారస్థుల కోసం వెండింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. వెండింగ్ జోన్‌లోనే వారు వ్యాపారాలు చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ వీధి వ్యాపారస్థుల కమిటీ సమావేశం జరిగింది. వీధి వ్యాపారస్తుల సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వీధి వ్యాపారస్థులకు జీవనోపాధుల కల్పనతో పాటు వారికి అవసరమైన సదుపాయాల ఏర్పాటు చేస్తామన్నారు. వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని శానిటేషన్ అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ కమిటీకి ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ తస్లీమ్‌ను సభ్యురాలిగా నియమించినట్లు ప్రకటించారు. ట్రాఫిక్ రూల్స్‌పై ఎస్ఐ తిరుపాల్ వివరించారు. సమావేశంలో మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, శానిటేషన్ అధికారులు చంద్రశేఖర్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై దాడి



గాయపడిన ఆటోడ్రైవర్ ఖలీల్

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో చిన్న పిల్లల విషయంపై గురువారం ఆటో డ్రైవర్‌పై దాడి జరిగింది. వివరాల్లోకి వెళితే.. పది రోజుల క్రితం ఖలీల్ కుమార్తె బెల్లు కొట్టిందని బాబా అనే వ్యక్తి గొడవకు దిగాడు. బాబా, ఖలీల్ ఇద్దరు పరస్పరం కొట్టుకున్నారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని ఖలీల్‌పై బాబా దాడికి దిగాడు. దాడిలో గాయపడిన ఖలీల్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

యాడికి: ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయిన లారీ బోల్తాపడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు..నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన డ్రైవర్ మధు కర్ణాటక నుంచి గ్రానైట్ లోడుతో తాడిపత్రికి బయలుదేరాడు. మోడల్ స్కూల్ వద్ద తాడిపత్రి నుంచి గుత్తి వైపునకు వచ్చే వాహనాన్ని తప్పించబోయిన డ్రైవర్ లారీని పక్కకు తిప్పడంతో పల్టీలు కొట్టి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఘటనలో లారీ డ్రైవర్ మధుకు చేతికి తీవ్రగాయమైంది. స్థానికులు అతడిని 108లో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రోడ్డు పక్కన బోల్తా పడిన లారీ

కుక్కల దాడిలో గాయపడిన జింక



గాయపడిన జింక

పుట్లూరు: శనగలగూడూరు గ్రామంలో గురువారం కుక్కల దాడిలో జింక గాయపడింది. కుక్కల బారి నుంచి తప్పించుకోవడానికి గ్రామంలోకి వచ్చిన జింకను గ్రామస్తులు రక్షించారు. అప్పటికే జింక గాయాలకు గురికావడాన్ని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. యల్లనూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గయాజుద్దీన్, సుధాకర్ జింకను యల్లనూరు పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. గాయపడ్డ జింకను ఎస్ఐ రామకృష్ణ పరిశీలించారు. అనంతరం జింకను అటవీప్రాంతంలో వదిలేసినట్లు వారు తెలిపారు.

ఎంపీడీఓ, ఎంఈఓలకు సన్మానం

గుత్తి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ-2 గా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌తో పాటుగా చిత్రా శ్రీనివాసులు, ఎంఈఓలు రవినాయక్‌ను ఎస్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించారు. నాయకులు ప్రసాద్, శంకర్, డానియేల్, ఆసిఫ్, వెంకటరమణయ్య, సురేష్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మాదన్న, ఓబులేసు, ప్రవీణ్, వన్నయ్య పాల్గొన్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 26 లోపు అర్హులైన విద్యార్థులు పాఠశాల వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28న మోడల్ స్కూల్లోనే ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

గుత్తి: పట్టణంలోని మోడల్ స్కూల్లో 2023-24కు సంబంధించి 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉష గురువారం తెలిపారు. బీసీ, ఓసీలు రూ. 150, ఎస్సీ, ఎస్టీలు రూ. 75 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

పుట్లూరు: ఆదర్శ పాఠశాలలో 7,8,9వ తరగతులకు సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు హెచ్ఎం ఆస్మాసయేద తెలిపారు. ఈ నెల 24లోపు దరఖాస్తులను పాఠశాలలో అందించాలని, 27న అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

యల్లనూరు: చిలమకూరు ఆదర్శ పాఠశాలలో 7,8,9వ తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ఈనెల 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటపతి తెలిపారు. విద్యార్థి ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ, జిరాక్స్ పాస్‌ఫొటోలను శనివారం లోగా పాఠశాలలో అందజేయాలన్నారు.

పామిడి: మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతులకు సంబంధించిన ఖాళీ సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ గురువారం తెలిపారు. 7వ తరగతిలో 6 సీట్లు, 8వ తరగతి లో 2 సీట్లు, 9 వ తరగతిలో 1 సీటు ఖాళీ ఉన్నాయన్నారు.

సచివాలయాల తనిఖీ

పామిడి: ఎద్దులపల్లి, రామగిరి సచివాలయాలను గురువారం ఈఓఆర్డీ బీవీ శశికళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె సచివాలయాల రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రామగిరి ఎగువతండాలో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు.



ఎద్దులపల్లి సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఈఓఆర్డీ బీవీ శశికళ

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మృతుడు కుమారస్వామి

గుత్తి: తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన లక్ష్మిదేవి చిన్న కుమారుడు కుమారస్వామి(16) ఇటీవలే పదవ తరగతి పాసయ్యాడు. దీంతో కుమార స్వామిని విజయవాడలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో చేర్పించారు. అయితే కాలేజీకి వెళ్లకుండా కుమారస్వామి ఇంటి వద్దే ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం తన కుమారుడిని కాలేజీకి వెళ్లాలని చెప్పినా నిరాకరించడంతో అతడిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే కుమారస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం కుమారస్వామి పుట్టిన రోజు. పుట్టిన రోజును ఎంతో ఘనంగా జరపాలని కుటుంబ సభ్యులు ఎంతో ఆశపడ్డారు. ఉన్న ఫళంగా కుమారస్వామి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

శాంతియుతంగా జీవించండి

యల్లనూరు: ప్రతి పౌరుడు శాంతియుతంగా జీవనం సాగించాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలో నీర్జాంపల్లి, దంతలపల్లి, శింగవరం, బుక్కాపురం, వాసాపురం, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా కక్షలు, కార్పణ్యాలు ఉండరాదన్నారు. ఫ్యాక్షన్‌తో ప్రజలకు ఇబ్బందులు కల్గించినా సహించేది లేదన్నారు.

దేవరకొండ కౌసల్యకు గోసేవా మహానంది అవార్డు

అనంతపురం కల్చరల్: గో సేవ కోసం విశేష కృషి చేస్తున్న అనంతపురం నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త దేవరకొండ కౌసల్యను గోసేవా మహానంది అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు తెలుగు సాహితీవేదిక సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న గుంటూరులోని పోలేరమ్మ దేవస్థాన కళాప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఆమెకు పురస్కారం అందజేసి సత్కరిస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన కౌసల్యను స్వామి ఆత్మవిదానంద సరస్వతి, గోసేవకులు రమేష్ భరద్వాజ్ అభినందించారు.

సహజీవనం చేసి ముఖం చాటేశాడు

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భార్య, పిల్లలు ఉన్నా ఓ వ్యక్తి ఓ మహిళను మాయమాటలతో లోబరుచుకొని సహజీవనం చేశాడు. ఆమె కష్టార్జితాన్ని కూడా దోచుకుని చివరకు ముఖం చాటేశాడు. దీంతో బాధితురాలు నాల్గవ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. రుద్రంపేటలో నివాసం ఉంటున్న రాధ వంటమనిషిగా పని చేస్తోంది. హరినాథ్ అనే వ్యక్తిని నమ్మి ఏడేళ్లుగా అతనితో సహజీవనం చేసింది. మాయమాటలు చెప్పిన హరినాథ్.. ఆమెతో రూ.15 లక్షలు నగదు, బంగారు నగలను తీసుకున్నాడు. చివరకు దేవుడి పటాల వద్ద ఉంచిన మొత్తాన్ని కూడా కాజేశాడు. అనంతరం ముఖం చాటేశాడు. అతను శింగనమలలో ఉన్నట్లు తెలుసుకొని వెళ్లగా అతనికి వివాహమైనట్లు తెలిసింది. తీసుకున్న నగదు వెనక్కు ఇవ్వాలని కోరగా హరితోపాటు అతని భార్య అంజలీ ఆమెను బెదిరించారు. దీంతో బాధితురాలు శింగనమల పోలీసులను ఆశ్రయించింది. అయితే కేసు వాపసు తీసుకోవాలని ఈనెల 6న హరి, అతని బంధువులు రాధాను బెదిరించారు. దీంతో రాధ నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

● పొంచి ఉన్న ప్రమాదం



చేతికందే ఎత్తులో వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలు

పెద్దపప్పూరు: అత్తిరాలదిన్నె గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు ఒరగడంతో 11కేవి విద్యుత్తు వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు అందోళన చెందుతున్నారు. గాలీవాన పెద్దెత్తున వస్తే విద్యుత్ స్తంభాలు పూర్తిగా పడిపోయే అవకాశం ఉంది. ఏది ఏమైనా ప్రమాదాలు జరగక ముందే అధికారులు తీగలతో పాటు విద్యుత్ స్తంభాలను సరి చేయాలని రైతులు కోరుతన్నారు. ఇదే విషయమై ట్రాన్స్ కో ఏఈ నరసింహులును ఫోన్‌లో సంప్రదించగా మూడురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలి

గుత్తి: సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నిర్మల, మండల కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, పట్టణ కార్యదర్శి మాబు తదితరులు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకులు కవిత, రేణుక, షఫి, మద్దిలేటి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్లలో సుధారాణి అనే మహిళపై దాడిన ముగ్గురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుధారాణికి, చిన్న భూషణ, లింగరాజు, గంగరాజు మధ్య ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలం విషయంలో నాలుగు రోజుల క్రితం గొడవ జరిగింది. మాటా మాటా పెరిగి సుధారాణిపై దాడి చేసి గాయపరిచారు. సుధారాణి ఫిర్యాదు మేరకు చిన్న భూషణ, లింగరాజు, గంగరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు.